ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

శనివారం 22 నవంబరు 2025

24 నుంచి 'రైతన్న మీకోసం'

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 24 నుంచి 29వరకు 'రైతన్న మీకోసం' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో ఉన్న 3.50 లక్షల మంది రైతుల ఇళ్లకు అధికారులు వెళ్లి సర్వే చేపట్టనున్నట్లు చెప్పారు. ఎంత పొలం ఉంది? ఏ పంట వేస్తున్నారు? దిగుబడులు ఎలా వస్తున్నాయి? ఇంకా ఏమైనా అవసరమా? వంటి వివరాలను సేకరించి కల్టివేటర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీని కోసం క్లస్టర్ల వారీగా సచివాలయ సిబ్బందిని నియమించాలన్నారు. ఒక్కొక్కరు రోజుకు కనీసం 30మంది రైతుల వివరాలు నమోదు చేయాలని అన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి

- జిల్లావ్యాప్తంగా విశేష పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు
- ముగిసిన కార్తీకమాసం

విజయనగరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లావాసులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమిని జరుపుకొన్నారు. కార్తీకమా సం ముగింపు కావడంతో వేకువజామునే నదీ, సముద్ర స్నానాలు ఆచరించి దీపారాధన చేశారు. అనంతరం ఆలయాలకు చేరుకున్నారు. శివయ్యకు విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. సారిపల్లి, నెల్లిమర్ల వద్ద నదిలో స్నానమాచరించి పూజలు నిర్వహించారు. అరటి దవ్వల్లో దీపాలు వెలిగించి నీటిలో విడిచిపెట్టారు. అనంతరం ఆలయాల్లో ఉన్న పురోహితులకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు, వస్త్రాలు వంటికి దానాలు చేశారు.



శివలింగం వద్ద దీపం వెలిగిస్తున్న భక్తురాలు



విజయనగరం రింగురోడ్డు వద్దనున్న వేంకటేశ్వర స్వామి ఆలయ కోనేరులో దీపాలు విడిచి పెడుతున్న భక్తులు

అనాథ బాలల సంక్షేమానికి **చిత్తశుద్ధితో కృషి**

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

6లో

పకడ్బందీగా ధాన్యం **కొనుగోలు చేపట్టండి**

- జేసీ సేతు మాధవన్

6లో

రుణాలను సద్వినియోగం **చేసుకోండి**

- డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసపాణి

6లో

పీఎఫ్ బకాయిలను **చెల్లించాల్సిందే**

- శ్రామిక సంఘం

6లో

మరింత నాణ్యతగా ఎండీఎం

- పెరిగిన డైట్ చార్జీలు
- ఒక్కో విద్యార్థికి రూ.1.15 వంతున పెంపు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

రాజాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం)పై ప్రభుత్వం కీలక నిర్ణయం నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు మరింత నాణ్యతగా భోజనం అందించేందుకు డైట్ చార్జీలను పెంచింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5.45 చెల్లించగా, ఇప్పుడు రూ.6.19కు పెంచింది. గతం కంటే 74 పైసలు అదనం. 6 నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు సంబంధించి గతంలో రూ.8.17 చెల్లించగా, దీన్ని రూ.9.29కు పెంచింది. గతం కంటే రూ.1.15 ఎక్కువ. డైట్ చార్జీల పెంపుతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం లభించడంతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులకు సైతం ప్రయోజనం దక్కనుంది. కాగా, ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా డైట్ చార్జీలు పెంచిన దాఖలాలు లేవు.

1.12 లక్షల మందికి లబ్ధి

జిల్లాలో అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలలు 2,283 ఉన్నాయి. వాటిలో 1.14 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 1.12లక్షల మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నట్టు గణాం కాలు చెబుతున్నాయి. వీరికి 600 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యాహ్న భోజన పథకం తీరుమారింది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరు మార్చింది. సన్నబియ్యంతో కూడిన అన్నం, ఆపై క్రమం తప్పకుండా మెనూను అధికారులు అమలు చేస్తున్నారు. ఉపాధ్యాయులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. వారు ముందు (మిగతా 8వ పేజీలో..)

టిడ్కో పనుల్లో కదలిక



బొబ్బిలి టిడ్కో కాలనీ

- కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు
- తాగునీటి ట్యాంకు అంతర్గత రోడ్ల పనులు ప్రారంభం
- జూన్ నాటికి పూర్తి చేయడమే లక్ష్యం

బొబ్బిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని టిడ్కో ఇళ్ల పనుల్లో కదలిక వచ్చింది. కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లించడంతో టిడ్కో కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు తాగునీటి ట్యాంకు నిర్మాణంతో పాటు అంతర్గత రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. వీటిని వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ఉన్నారు. ఇంకా భూగర్భ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు చేపట్టాల్సి ఉంది.

ఇదీ పరిస్థితి..

బొబ్బిలి మునిసిపాలిటీ రామన్నదొరవలస సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు సమీపంలో 31.69 ఎకరాల్లో 2,448 ఇళ్ల టిడ్కో ఇళ్ల నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 300 చదరపు అడుగుల్లో 1,344 ఇళ్లు, 365 చదరపు అడుగుల్లో 528 , 430 చదరపు అడుగుల్లో 576 ఇళ్లను మంజూరు చేసింది. ఒక్కో బ్లాకులో 48 ప్లాట్‌లు చొప్పున 51 బ్లాకులు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. హడ్కో రుణంతో ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది. ఒక రెండు వాయిదాల చొప్పున లబ్ధిదారుల నుంచి రూ.2.56కోట్లు వసూలు చేశారు. అలాట్ చేసిన 2,090 ప్లాట్లకు గాను రూ.7.39కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో రూ.2.26కోట్లు ఏటీ టిడ్కోకు బదలాయించారు. 2018 డిసెంబరులో 2,090 మంది (మిగతా 8వ పేజీలో..)



తాగునీటి ట్యాంకు పనులు జరుగుతున్న దృశ్యం

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- డీఎస్పీ గోవిందరావు
- అభ్యుదయం యాత్రకు స్వాగతం





ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

కొత్తవలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలైన గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని విజయనగరం డీఎస్పీ గోవిందరావు అన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ అభ్యుదయం పేరుతో పాయకరావు పేట నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర శుక్రవారం కొత్తవలసకు చేరుకుంది. ఈ సైకిల్ యాత్రకు డీఎస్పీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యుక్త వయసులో ఉన్న వారు మంచి కంటే చెడువైపు ఎక్కువగా ప్రభావితం అవుతుంటారన్నారు. చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తు ఎంతో బాగుంటుందని పేర్కొన్నారు. మంచి మార్గంలో నడుచుకుని మరి కొంతమందికి ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ షణ్ముఖరావు, పోలీసు సిబ్బంది, వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

యంత్రాంగం ఏం చేస్తోంది?

- మాతృ, శిశు మరణాలపై కలెక్టర్ ఆగ్రహం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరిక

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవించడంపై కలెక్టర్ రామసుందర్‌రెడ్డి వైద్యా ఆరోగ్య శాఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరణాలు చోటు చేసుకుంటుంటే క్షేత్రస్థాయిలో యంత్రాంగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా మెటర్నల్, చైల్డ్ డెత్ సర్వేలెన్స్ రెస్పాన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణ రక్షణ కోసమే యంత్రాంగం ఉందని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యహరిస్తే సహించేది లేదని (మిగతా 8వ పేజీలో..)



మాట్లాడుతున్న కలెక్టర్

పక్షి ప్రమాద రహితంగా భోగాపురం విమానాశ్రయం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పక్షి ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. మొట్టమొదటి ఏరోడ్రోమ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఏఈఎంసీ) సమావేశాన్ని కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించారు. ప్రకృతికి అనుకూలంగా, సురక్షితమైన, సుస్థిరమైన విమానాశ్రయ వాతావరణాన్ని కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పది కిలో మీటర్ల పరిధిలో పక్షి ప్రమాదం లేని ప్రాంతాన్ని సృష్టించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక పరిపాలన యంత్రాంగానికి, విమానాశ్రయ నిర్వహణ సంస్థకు మధ్య పరస్పర సహకారం ఉండాలన్నారు. పర్యావరణ భద్రత, నిర్వహణలో భోగాపురం విమానాశ్రయాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో విమానాశ్రయం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ లక్ష్మీ వర్మ భాస్కర్, ప్రాజెక్టు హెడ్ బీహెచ్‌ఏ రామరాజు, పర్యావరణ నిపుణులు ఏజేడీ కార్తీక్, వన్య ప్రాణి రక్షణ నిపుణులు బిభూ పాండే, ఆర్డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి
- విశాఖ ఎంపీ శ్రీభరత్



ఎస్.కోటలో ఎంఆర్‌సీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే లలితకుమారి తదితరులు

శృంగవరపుకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ తెలిపారు. శుక్రవారం శృంగవరపుకోట నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు పలు నిర్మాణాలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ విద్యార్థులు కష్టపడి చదువుతారని, వారిని ప్రోత్సహించేందుకు ఎంపీ లాడ్స్ నిధులను కేటాయిస్తానన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆ పార్టీకి ఓట్లు వేయని గ్రామాల అభివృద్ధిపై వివక్ష చూపిందన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తుందన్నారు. వేపాడ మండలంలో వరి సాగు బాగా కనిపిస్తుందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు త్వరలో (మిగతా 8వ పేజీలో..)

నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా జనార్దనరావు

నెల్లిమర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కమిషనర్‌గా ఎస్.జనార్దనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం నగరపాలక సంస్థలో శానటరీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. జనార్దనరావుకు ఇన్‌చార్జి కమిషనర్ జయరాం, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటు అభినందనీయం

- మంత్రి అచ్చెన్నాయుడు
- పార్వతీపురంలో ప్రారంభం

6లో



కార్తీకం ముగిసినా తగ్గలే..

- దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు
- కిలో వంకాయలు రూ.80, పందిరి చిక్కుడు రూ.100
- సామాన్య, మధ్యతరగతి ప్రజల బెంబేలు

విజయనగరం రూరల్/కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ.60 నుంచి రూ.80 పలుకుతోంది. మరికొన్ని ధరలు రూ.100నుంచి రూ.120 ఉన్నాయి. కార్తీకమాసం ముగిసినా కూరగాయల ధరలు తగ్గకపోవడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. కిలో కొనాల్సిన వారు పావు, అర కిలోతో సరిపెట్టుకోవలసి వస్తుంది. బహిరంగ మార్కెట్‌లో టమోటా కిలో రూ.60 నుంచి రూ.70, వంకాయలు రూ.80, బీరకాయలు రూ.60నుంచి రూ.65, పందిరి చిక్కుడు రూ.120, అరటి కాయ ఒకటి రూ.15, ఉల్లి రూ.25, బంగాళదుంపలు కిలో రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. నాలుగైదు రకాల కూరగాయాలను కొనుగోలు చేయాల్సిన వినియోగదారులు వాటి ధరలను చూసి ఒకట్రెండు రకాల కూరగాయలతో సరిపెట్టుకుంటున్నారు.



రైతు బజార్లలో కొంత తక్కువ..

విజయనగరంలో మూడు రైతు బజార్లు ఉన్నాయి. ఇక్కడ కూరగాయలను బయట మార్కెట్ కంటే కొంత తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. రైతు బజార్లలో కిలో టమోటా రూ.49, వంకాయలు రూ.60, బీరకాయలు రూ.55, పందిరి చిక్కుడు (మిగతా 8వ పేజీలో..)

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



విజయనగరం: నెల్లిమర్ల వద్ద చంపావతి నదిలో దీపాలు వదులుతున్న భక్తులు

పోలి పాడ్యమి సందర్భంగా శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల నదులు, చెరువులు, కాలువల్లో మహిళలు దీపాలు విడిచిపెట్టారు. వేకువజాము నుంచే దీపారాధనలో పాల్గొన్నారు. అనంతరం సమీపంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శైవ, వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

-ఆంధ్రజ్యోతి బృందం



బొబ్బిలి రూరల్ : పెంట గ్రామంలో వేగావతి నదిలో దీపాలు వదులుతున్న మహిళలు



వీరఘట్టం: కడకెల్లలో నదిలో దీపాలు విడిచిపెడుతూ..



బొబ్బిలి: పాతబొబ్బిలి మహారాణి కోనేరులో దీపారాధన



గరుగుబిల్లి: నాగావళి నదికి పంచ హారతులు ఇస్తున్న అర్చకులు



గరుగుబిల్లి: తోటపల్లి దేవస్థానంలో స్వామి వారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



వంగర: సంగాంలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు



సీతంపేట రూరల్: గణపతి ఆలయ ప్రాంగణంలో మహిళలు నిర్వహించిన దీపారాధన సేవ



రాజాం రూరల్: పోలిపాడ్యమి పూజల్లో పాల్గొన్న మహిళలు



బొబ్బిలి: అగ్రహారం వీధిలో పోలిపాడ్యమి పూజలు



విజయనగరం: రింగురోడ్డు వద్దనున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



విజయనగరం: వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు చేపట్టండి

● జేసీ సేతు మాధవన్

బొబ్బిలి రూరల్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జేసీ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెట్టవలస రైతు సేవాకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అక్కడ రికార్డులను, పరికరాలను పరిశీలించారు. టార్పాలిన్లు, సిబ్బంది లభ్యతను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో తలెత్తిన లోటుపాట్లు పునరావృతం కాకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అలాగే ధాన్యం సేకరణ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంతవరకూ 10 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందన్నారు. 382 పీపీసీలు, 261 క్లస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. అందులో 159 మిల్లులు యాక్టివ్‌గా పనిచేస్తున్నాయన్నారు. రూ.30 కోట్లు బ్యాంక్ గ్యారంటీలు ఇచ్చాయన్నారు. బొబ్బిలిలో 17 కేంద్రాల్లో ఇంతవరకూ 6 మెట్రిక్ టన్నుల సేకరణ జరిగిందని జేసీకి ఏవో శ్యామ్‌సుందర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, వీపీఏ కర్రోతు రామారావు, సాంకేతిక నిపుణురాలు గొర్లె సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

● రామభద్రపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రొంపల్లి గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం జేసీ సేతు మాధవన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం కొనుగోళ్లు నిబంధనల ప్రకారం పూర్తిచేయాలని సూచించారు. యాప్‌లపై సరిగ్గా అధికారులు ఆపరేట్ చేయాలని సూచించారు. తేమశాతం 17శాతం ఉండేటట్లు చూడాలన్నారు. అలాగే గోనె సంచులపై ఆరా తీశారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా జిల్లా కంట్రోల్ రూం నెంబరు 8978975284ను సంప్రదించాలని తెలిపారు. ఆయనతో పాటు తహసీల్దార్ అజురఫీ జాన్, సీఎస్ డీటీ ఆర్.సాయికృష్ణ, మండల వ్యవసాయాధికారి అమరా శివ పాల్గొన్నారు.



మెట్టవలస రైతుసేవా కేంద్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియపై చర్చిస్తున్న జేసీ సేతుమాధవన్



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

చందులూరును ఆదర్శంగా తీసుకోండి

● ఎంపీ శ్రీభరత్

లక్కవరపుకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యకు, అభివృద్ధికి చందులూరు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాలన్నీ అభివృద్ధి చెందాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం ఆయన రంగా రాయపురంలో రూ.14.90 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే లలితకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు నిస్వార్థంతో ప్రజలకు సేవచేసినప్పుడు అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. చందులూరు గ్రామంలో అత్యధికంగా విద్యావంతులు ఉన్నారని... అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు సంపాదించి గ్రామ అభివృద్ధిలో పాలు పంచుకోవడం విశేషమని తెలిపారు. తాను కూడా మొదటి ప్రాధాన్యం విద్యకు.. తరువాత ఆరోగ్యానికి ఇస్తానన్నారు. గ్రామ పెద్దలు కరెడ్ల ఈశ్వరరరావు కోరిన చెత్తశుద్ధి కేంద్రం, సచివాలయం, స్మశాన వాటికల నిర్మాణానికి ప్రాధాన్య క్రమంలో నిధులు కేటాయిస్తానన్నారు. కేబీపీ రాంప్రసాద్, కొల్లు రమణమూర్తి, చొక్కాకుల మల్లునాయుడు, మల్లా రామకృష్ణ, రత్నాజీ, సర్పంచ్ రామలక్ష్మి, ఐసీడీఎస్ పీవో పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

● డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసపాణి

విజయనగరం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసపాణి అన్నారు. శుక్రవారం సంఘాల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోడల్‌గా ఎంపిక చేసిన పది మండలాల్లో విజయనగరం మండల సమాఖ్య సభ్యులతో పాటు విశాఖపట్టణం, శ్రీకాకుళం, పార్వతీపురం-మన్యం సిబ్బందికి శిక్షణ అందిస్తామన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, ప్రవర్తనలో మార్పు, జీవనోపాధి సామర్థ్యాల పెంపు వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఐబీ యూనిట్ ఎగ్జిక్యూటివ్ శోభ, వరప్రసాద్, డీఆర్‌డీఏ డీపీఎంలు చిరంజీవి, రామ్మోహన్, వైదేహి తదితరులు పాల్గొన్నారు.



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వరి పంటను పరిశీలిస్తున్న మంత్రులు,కలెక్టర్ తదితరులు

భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటు అభినందనీయం

● మంత్రి అచ్చెన్నాయుడు

పార్వతీపురం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భూసార పరీక్షా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన సేవలను పూర్తిస్థాయిలో అందించాలన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మం త్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారిగా భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటైందన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మట్టి మూనాలను విజయనగరం తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ సందర్భంగా సేంద్రియ ఎరువులతో సాగుచేసిన వరి పంటను మంత్రులు పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్లు వైశాలి, పవర్‌స్వప్నిల్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

● కలెక్టర్ రామసుందర్ రెడ్డి



పిల్లలకు నామకరణం చేస్తున్న కలెక్టర్, న్యాయ సేవా కార్యదర్శి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనాథ బాలల సంరక్షణ కోసం గ్రామస్థాయిలోని కమిటీలు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అనాథ బాలల సంక్షేమం -పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వ మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉన్న పాఠశాలల్లో ఇప్పటి వరకూ 350 మందికిపైగా విద్యార్థులు మానివేశారని, వారి వివరాలు సేకరించి, తక్షణ చర్యలు చేపట్టాలని డీఈవోను ఆదేశించారు . బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గ్రామ కమిటీలు వివరించాలన్నారు. బాల బాలిక వసతి గృహాల్లో సరైన పౌష్టికాహారం అందించాలని... లేని పక్షంలో సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్‌ల సమక్షంలో పిల్లలు లేని దంపతులకు ఒక శిశువును బంధుత్వ దత్తత స్వీకారం చేశారు. శిశు గృహం సంరక్షణలో ఉన్న ఇద్దరు శిశువులకు దేవాన్స్, శాన్విక అని నామకరణం చేశారు. న్యాయ సేవాకార్యదర్శి కృష్ణ ప్రసాద్ సమక్షంలో మిషన్ వాత్సల్య పథకంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఎనిమిది మంది పిల్లలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విమలరాణి, డీఈవో మాణిక్యం నాయుడు, జిల్లా వైద్యాధికారి జీవనరాణి తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయిలను చెల్లించాల్సిందే..

నెల్లిమర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జ్యూట్ కార్మికులకు 2018 నుంచి 2022 వరకు ఉన్న పీఎఫ్ బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని శ్రామిక సంఘం అధ్యక్షుడు చిక్కాల వెంకట గోవిందరావు డిమాండ్ చేశారు. కార్మికులకు సంబంధించి పది సమస్యలతో కూడిన వినపతిపత్రాన్ని శుక్రవారం యాజమాన్య ప్రతినిధులకు అందజేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ గత మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు తక్షణమే పీఎఫ్, గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి బేతా అప్పారావు, ప్రతినిదులు జి.ప్రసాద్, రెడ్డి సన్యాసినాయుడు, సముద్రపు అప్పారావు, పి.గోవింద్, బి.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు గోవిందరావు

సాగుభూములపై వాస్తవిక సర్వే చేయండి



ఎస్.కోట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర ప్రాంతంలో గతంలో జిందాల్ పరిశ్రమకు భూములు ఇచ్చామని.. తమ సాగుభూములను స్వాధీనం చేసుకున్న జిందాల్ పరిహారం ఇవ్వకుండా ఫలసాయాన్ని నరికించిందని నిర్వాసితులు అన్నారు. శుక్రవారం తమ 160వ రోజు దీక్షలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం రెవెన్యూ సిబ్బంది తమ భూముల్లో సర్వే చేస్తున్నారని అన్నారు. తమకు కచ్చితమైన సమాచారం అందించి రావాలని... తాము లేని సమయంలో వచ్చి భూముల్లో ఎవరూ లేరని రాసుకొని వెళ్లడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందన్నారు. రెవెన్యూ సిబ్బంది నిజాయితీగా సర్వే చేయాలని కోరారు.

నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

మన్యాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

● మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి

పార్వతీపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విలేఖర్లతో మాట్లాడుతూ.. 'ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన, రంగు మారిన ధాన్యం, పత్తి కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. కొమరాడలో మరో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తాం.ఆధునిక సాంకేతిక సాగు పద్ధతులు అమలు చేసి రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకుంటాం. పాడి పరిశ్రమకు జిల్లా అనుకూలం. ఆ దిశగా దృష్టి సారించి పాడి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలని అధికారులను ఆదేశించాం. విద్యార్థుల కోసం ప్రతి పాఠశాలలో తాగునీటి వసతికి రూ. ఐదు కోట్ల మంజూరు చేశాం. వీలైనంత త్వరగా టెండర్లు పిలిచి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తాం. మరో రెండు మాసాల్లో జిల్లాలో అన్ని ఆసుపత్రి భవన నిర్మాణాలు పూర్తి చేయిస్తాం. జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేయడం అభినందనీయం. సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారిస్తాం. పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం, ఆసుపత్రుల్లో వైద్యుల నియామకానికి చర్యలు చేపడతాం.' అని తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్

విజయనగరం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా)లో గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ ఈ కార్యక్రమం జరగనుంది. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వినతులు స్వీకరించనున్నారు.

డీటీకి అస్వస్థత

నెల్లిమర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల మండల ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్, ఇన్‌చార్జ్ హెచ్‌డీటీ వీఈవోఆర్ జగన్నాథరావు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కార్యాలయానికి విధులకు హాజరైన ఆయన కొద్దిసేపటికే తీవ్ర తలనొప్పితో బాధపడుతూ కుర్చీ లోనే కుప్పకూలిపోయారు. తహసీల్దార్ కె.శ్రీకాంత్ వెంటనే స్పందించి తన కారులోనే సమీపంలో ఉన్న మిమ్స్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. మెదడులో నరాలు చీలి నట్లు ప్రాథమికంగా గుర్తించినట్టు సమాచారం. మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు విశాఖపట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ మిమ్స్‌కు చేరుకొని డీటీ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో జేఎన్‌టీయూ ప్రతిభ

విజయనగరం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఈ నెల 14న నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 10 మంది విజయం సాధించారు. ప్రముఖ స్టీల్ సంస్థ ఈ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వీసీ ప్రొఫెసర్ వి.వెంకట సుబ్బారావు నియామక పత్రాలను శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అందించారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక

గుర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ సైక్లింగ్ పోటీలకు కెల్ల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం బి.లీలాకుమారి తెలిపారు. ఈ నెల 23 నుంచి ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు పీడీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సిద్ధార్థ కాలనీలో పోలీసు పికెట్

భోగాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముంజేరు పంచాయతీ సిద్ధార్థ కాలనీలో గురువారం రాత్రి నుంచి పోలీస్ పికెట్ కొనసాగుతోంది. మురుగు కాలువ నిర్మాణం విషయమై ముంజేరు గ్రామస్తులకు, సిద్ధార్థ కాలనీ వాసులకు మధ్య గురువారం తగాదా జరగడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ కె.దుర్గా ప్రసాదరావు తెలిపారు.

శ్రమదానంతో పరిశుభ్రం

లక్కవరపుకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రీన్ విలేజ్‌గా ఎల్.కోట తలారి గ్రామం తయారైంది. శుక్రవారం గ్రీన్ అంబాసిడర్లంతా కలసి కాలువల్లో మురుగు, చెత్త, రోడ్డు పక్కన ఉన్న మొక్కలను తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లి, మంచినీటిని క్లోరినేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.అప్పారావు, ఈవోపీఆర్‌డీ కుమార్, సర్పంచ్ గుమ్మడి జ్యోతిరత్నం, ప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

విజయనగరం కోట ఓ అద్భుతం

విజయనగరం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని విజయనగరం మహారాజా వారి కోట ఓ అద్భుతమని కుమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆ పాఠశాల ఏడో తరగతి విద్యార్థులను విజయనగరం కోటతో పాటు రామతీర్థం తదితర ప్రాంతాల సందర్శనకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని బి.కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను అడ్డుకున్న జనం

భోగాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేను స్థానికులు అడ్డుకున్నారు. ఇద్దరు వ్యక్తులు సర్వే నెంబరు 1బై1లో కొండ సమీపంలో సర్వే చేస్తుండగా... స్థానికులు వారిని అడ్డుకున్నారు. వీఎంఆర్‌డీఏ, విజయనగరం సర్వే అధికారులు చెప్పిన ప్రకారమే సర్వే చేస్తున్నామని వారు చెప్పారు. ప్రజలు అడ్డుకుంటున్నందున సర్వే చేయబోమని చెప్పి వెనుదిరిగారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయండి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు, రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు సూచించారు. మెరక ముడిదాం మండలంలోని కొర్లాం పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో శుక్రవారం చేరాయి. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అర్జీలను బుట్ట దాఖలు చేస్తే సహించేది లేదు

ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను బుట్ట దాఖలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కళావెంకటరావు స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించి ప్రజా దర్బార్‌లో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధి దీపాలు, పారిశుధ్య లోపం, తాగు నీరు, సీసీ రోడ్లు తదితర సమస్యలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీటి పరిష్కారం పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజాదర్బార్'



మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి. పక్కన ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపడుతోందని రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజల నుంచి 90 వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతులు 90 వరకు పరిష్కారమయ్యాయని చెప్పారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధి

రాష్ట్రంలో కూటమి పాలనలో సంక్షేమంతో పాటు సమాంతరంగా అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ పి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. రాజాంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ బాటలో సీఎం చంద్రబాబు పయనిసూ ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్ల అప్పలనాయుడు, బొత్స వాసుదేవరావు నాయుడు, కోండ్రు జగదీష్, గురవాన నారాయణరావు, సుమల వెంకటమన్మథరావు, గట్టి భాను, దూబ ధర్మారావు, డి.శ్రీనివాసరావు, వల్లూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

స్థానిక వాసవీనగర్ కాలనీలో రూ.27 లక్షలతో తలపెట్టిన డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. రాజాం పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.రామచంద్రరావు, ఏఈ వెంకటరామరాజు, నాయకులు గురవాన నారాయణరావు, శాసపు రమేష్‌కుమార్, దుప్పలపూడి శ్రీనివాసరావు, టంకాల దిలీప్, పొట్నూరు శేఖర్, పిల్లా సత్యంనాయుడు, గార గున్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరైతే ఊరుకునేది లేదు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల సిబ్బంది విధులకు గౌర్హాజరైతే ఊరుకునేది లేదని కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని 44,45వ సచివాలయాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయాల సిబ్బంది హాజరు పలుచగా ఉండడంతో మిగతా వారు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. సిబ్బందిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని... సక్రమంగా విధులు నిర్వహించకపోతే సహించబోనని అన్నారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ మహాసభలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కేంద్రంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేష్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 27న ఉదయం 10 గంటలకు విద్యార్థులతో భారీ ర్యాలీ, అనంతరం గురజాడ కళాభారతిలో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు శిరీష, చినబాబు, రవికుమార్, జగదీష్, సోమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

ప్రజా వినతుల పరిష్కారంపై దృష్టి



వినతులు స్వీకరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన వినతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలో గల తన స్వగృహం వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. భూ, ఎయిర్‌పోర్టు నిర్వాసితుల సమస్యలు, రోడ్లు, కాలువలు, విద్యుత్తు తదితర సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు



రాజాం రూరల్: ప్రసంగిస్తున్న సీఐ అశోక్‌కుమార్



రేగిడి: మాట్లాడుతున్న ఎస్‌ఐ బాలకృష్ణ

లక్కవరపుకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి మాదకద్రవ్యాల వల్ల యువత ఏవిధంగా గాడి తప్పుతున్నారో సమావేశంలో వివరించారు. ఎస్‌ఐ నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో ఎల్.కోట జంక్షన్ నుంచి స్థానిక పోలీసు స్టేషన్ వరకు విద్యార్థులు, ఈగల్ సిబ్బందితో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.

మత్తుతో జీవితాలు చిత్తు

రాజాం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు జీవితాలను చిత్తు చేస్తాయన్న విషయాన్ని యువత గ్రహించాలని రాజాం టౌన్ సి.ఐ. కె.అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. విద్యార్థులు సరదా కోసం వ్యసనాలకు అలవాటుపడి చివరికి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. ఇక్కడి జి.సి.ఎస్.ఆర్.డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యాలు విధించుకోండి

రేగిడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడువ్యసనాల జోలికి పోకుండా ఒక లక్ష్యంతో చదవాలని ఎస్‌ఐ బాలకృష్ణ దిశా నిర్దేశం చేశారు. ఉంగరాడ గురుకులంలో శుక్రవారం సైబర్‌క్రైం, పోక్సో యాక్టు, మాదకద్రవ్యాలపై ఎస్‌ఐ బాలకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా సాయంత్రం ఉంగరాడమెట్ట వద్ద ఎస్‌ఐ, సిబ్బంది ఆధ్వర్యంలో ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు.

బాలికలకు అవగాహన అవసరం

భోగాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు లైంగిక దాడులకు గురికాకుండా ఉండే విధంగా అవగాహన కల్పించవలసిన బాధ్యత అందరిపై ఉందని మనస్తత్వవేత్త, డీఐసీ ఉదయ్ కుమార్ అన్నారు. భోగాపురం వెలుగు కార్యాలయంలో శుక్రవారం దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2 నుంచి 18 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, వైద్యాధి కారులు మనస్వి, దివ్య, ఎంపీడీవో డీడీ స్వరూప రాణి, ఎస్‌ఐ సూర్యకుమారి, ఎంఈవో చంద్రమౌళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి



మాట్లాడుతున్న సీఐ నర్సింహమూర్తి

రాజాం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తద్వారా ప్రమాద సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు అన్నారు. హెల్మెట్ వినియోగంపై రాజాం టౌన్ సర్కిల్ సి.ఐ. అశోక్‌కుమార్ సారథ్యంలో శుక్రవారం నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి పాలకొండ రోడ్డులోని జి.ఎం.ఆర్.ఐటి... అక్కడి నుంచి శ్రీకాకుళం రోడ్డులోని తహశీల్దార్ కార్యాలయం వరకూ ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

విజయనగరం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ ఉంటుందని మహిళా పోలీసు స్టేషన్ సీఐ నర్సింహమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల మొబైల్ ఫోన్లలో శక్తి యాప్ ఉంటే... ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందన్నారు. గుర్తు తెలియని వాహనాలు, ఆటోల్లో ప్రయాణించేటప్పుడు సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ఫిక్స్ చేసి చేరుకోవలసిన ప్రాంతాన్ని నమోదు చేస్తే వారి ప్రయాణంపై పోలీసులు నిఘా పెడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శిరీష, శక్తి బృందం సిబ్బంది, కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

గరివిడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం గరివిడిలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బొత్స మాట్లాడుతూ నెల రోజుల క్రితం క్వింటా మొక్కజొన్న పంట మార్కెట్‌లో 2,700కు అమ్ముడుపోయేదని, ప్రస్తుతం రూ.1800 దాటడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. వరిపంటకు కూడా రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో ధాన్యం నగదు జమ

గుర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. మండలంలోని గూడెం, కెల్ల సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నె సన్యాసినాయుడు, సీహెచ్.మహేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసరి శివప్రసాద్, డాక్టర్ సుంకరి రమణమూర్తి, గూడెం సొసైటీ చైర్మన్ పిల్లా అప్పలనాయుడు, కెల్ల సొసైటీ చైర్మన్ విమలారాణి, కనిమెరక కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఇసుక ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



జగదీశ్వరి (ఫైల్)



బాధితుని నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

రాజాం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెనుబాక జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరోవ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. రాజాం పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ఎం.జె.వలస గ్రామానికి చెందిన జగదీశ్వరి (45) వెలుగులో వీఓఏగా పని చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల సభ్యుల రుణాలకు సంబంధించి రాజాంలోని కెనరా బ్యాంకు సిబ్బందితో మాట్లాడేందుకు శుక్రవారం వచ్చిన ఆమె పని ముగించుకుని అదే బ్యాంకులో సీఎస్‌పీగా పనిచేస్తున్న తన గ్రామానికి చెందిన రామారావుతో కలిసి స్కూటీపై తిరిగి వెళ్తున్నారు. రాజాం నుంచి చీపురుపల్లి వైపు వెళ్తున్న వీరి స్కూటీని వెనుక నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్ పెనుబాక జంక్షన్ వద్ద బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో జగదీశ్వరి అక్కడికక్కడే మృతి చెందగా రామారావు తీవ్ర గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడిన రామారావును చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు ప్రమాద స్థలం వద్ద పరామర్శించారు. ప్రమాద వివరాలను అతనిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం రాజాం ఏరియా ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేశారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రాజాం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గూడ్స్ ఢీకొని వ్యక్తి...

లక్కవరపుకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రంగరాయపురాన్ని ఆనుకొని ఉన్న అగ్రహారం బంద వద్ద గూడ్స్ రైలు ఢీకొని బత్తిన అప్పారావు (55) మృతిచెందినట్లు జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు తెలిపారు. మార్లాపల్లి గ్రామానికి చెందిన అప్పారావు మృతిచెందాడు. పిల్ల అగ్రహారంలోని తన కుమార్తె ఇంటికి వచ్చాడని... తిరిగి తన స్వగ్రామం మార్లాపల్లి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. కిరండోల్ నుంచి విశాఖ వస్తున్న గూడ్స్ ఢీకొట్టినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం మహరాజా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

అలమండ ఉపసర్పంచ్‌పై అట్రాసిటీ కేసు

జామి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అలమండ ఉప సర్పంచ్ లగుడు దేముడుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వైవీ జనార్దన్ తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ మట్లాడుతూ గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కోట అప్పారావు ఇంటి నిర్మాణానికి తీసుకువచ్చిన ఇసుక, రాయి కమ్యూనిటీ హాల్ గోడవద్ద ఉంచారని చెప్పారు. దీనిపై ఆ వ్యక్తితో ఉపసర్పంచ్ వాదులాటకు దిగి కులంపేరుతో దూషించాడని బాధితుని నుంచి ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామని వివరించారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యరెడ్డి

బొండపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల దొంగతనం కేసులో విజయనగరానికి చెందిన పడాల జనార్దన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇళ్ల ముందు ప్రహరీలలో తాళం వేసి ఉన్న బైక్‌లను ఏడుగురు సభ్యుల ముఠా చోరీ చేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో గజపతినగరం సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో బొండపల్లి ఎస్‌ఐ యు.మహేష్ సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టారని... జనార్దన్‌తో పాటు ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారి నుంచి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి మిగిలిన వారిని అరెస్టు చేయవలసి ఉందని అన్నారు. బైక్ దొంగతనాలకు పాల్పడిన వారిని సాంకేతికత సాయంతో అరెస్టు చేసిన సీఐ ఏవీ రమణను, ఎస్‌ఐ యు.మహేష్‌ను, పోలీసు సిబ్బందిని డీఎస్పీ భవ్యరెడ్డి అభినందించారు. ఇదిలా ఉండగా... మద్యం తాగి వాహనాలు నడిపేవారికి గతంలో జరిమానా విధించే వారమని, ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని జైలు శిక్ష విధిస్తున్నట్టు ఆమె వెల్లడించారు. ఇప్పటికే బొండపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ముగ్గురికి, స్టేషన్ బూర్జవలస పరిధిలో ఇద్దరికి, జైలు శిక్ష విధించినట్టు ఆమె తెలిపారు.

ప్రమాదం ఘటనలో డ్రైవర్..

గరివిడి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బీజేపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక రి మృతికి కారణమైన బొలేరో డ్రైవర్ పైల మహేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చీపురుపల్లి డీఎస్పీ సూరాడ రాఘవులు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదాన్ని ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటనగా పరిగణించి నిందితుడిపై నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ నెల 19న నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్ బైక్‌ను ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న రాజాంకు చెందిన జె.వెంకటరమణ మృతిచెందగా... బైక్ నడిపిన హరీష్‌కు స్వల్ప గాయాలయ్యాయన్నారు. ఈ సమావేశంలో చీపురుపల్లి సీఐ శంకరరావు, గరివిడి ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు

దత్తిరాజేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి... వాహనాలు నడిపిన అయిదుగురికి ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్టు స్టేషన్ బూర్జవలస ఎస్‌ఐ జి.రాజేష్,పెదమానాపురం ఎస్‌ఐ ఆర్.జయంతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిపిన వాహన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడిపిన గజపతినగరం మండలం పాతబగ్గాంకు చెందిన కొలుసు అప్పన్న, పాచిపెంట మండలం మాతుమూరుకు చెందిన బుగ్గ చిన్న, బొబ్బిలి మండలం రాజుపేటకు చెందిన పెంట రఘు, రాయగడకు చెందిన బలుసు కుశల్య, పార్వతీపురం మండలం పూడేసుకు చెందిన కొండగొర్రి ధర్మారావులకు గజపతినగరం మెజిస్ట్రేట్ కోర్టు ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.

లక్కవరపుకోటలో...

లక్కవరపుకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాన్ని నడిపినందుకు రంగరాయపురం గ్రామానికి చెందిన బి.రామారావుకు కొత్తవలస కోర్టు మేజిస్ట్రేట్ విజయ్‌చంద్ర వారం రోజులు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ నవీన్‌పడాల్ తెలిపారు. మద్యం తాగి ఎవరు వాహనాలు నడిపినా శిక్ష తప్పదని స్పష్టం చేశారు.

పురుగు మందు తాగి వృద్ధురాలి మృతి

రామభద్రపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి వృద్ధురాలు మృతి చెందినట్టు ఏఎస్‌ఐ అప్పారావు తెలిపారు. ఏఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. పాతరేగకు చెందిన ఇల్లా అప్పయ్యమ్మ (70) గురువారం తన ఇంటి వద్ద పురుగు మందు తాగింది. విషయం తెలుసుకున్న చిన్నకోడలు బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి... మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు తెలిపారు. మృతురాలి భర్త ఇది వరకే మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉ న్నారు. కోడలు భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

కార్తీకం ముగిసినా తగ్గలే..

(5వ పేజీ తరువాయి)

రూ.92 వుండగా, అరటికాయ ఒకటి రూ.10, ఉల్లి, బంగాళ దుంపలు కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. బయట మార్కెట్, రైతు బజారు ధరల మధ్య కిలోకి రూ.10 నుంచి రూ.20 వరకు వ్యత్యాసం ఉంటుంది.

తగ్గిన ఉత్పత్తి..

జిల్లాలో కూరగాయల సాగు పెద్దగా లేకపోవడంతో ఉత్పత్తి తగ్గింది. ఒకప్పుడు విజయనగరంలోని మూడు రైతు బజార్లకు వివిధ రకాల కూరగాయలు 300 నుంచి 350 క్వింటాళ్లు వచ్చేవి. ప్రస్తుతం 100 నుంచి 150 క్వింటాళ్ల వరకే వస్తున్నాయి. ఆకుకూరలు ఆచూకీ ఎక్కడా కనిపించడం లేదు. వీటన్నింటికీ వర్షాలే కారణమని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వరుసగా కురుస్తున్న వర్షాలతో పాటు మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఆ ప్రభావం ధరలపై పడింది. ప్రస్తుతం కూరగాయల సాగు ప్రారంభ దశలో ఉంది. డిసెంబరు ఆఖరు నాటికి కొన్ని పంటల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మళ్లీ తుఫాన్ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతిని కూరగాయల ధరలు మరింత రెట్టింపయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

ముఖాముఖీ కార్యక్రమం ఏర్పాటు చేస్తానన్నారు. గ్రామాల్లో రోడ్లు, పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కాభవనాల నిర్మాణాలతోనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే లలిత కుమారి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుమారు రూ.6కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఎంపీ లాడ్స్ నిధులను కేటాయించేందుకు ఎంపీ శ్రీభరత్ ముందుకు రావడంతో ధన్యవాదాలు తెలిపారు. ఎస్.కోట శాఖా గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలని లైబ్రేరియన్ దామోదర శ్రీధర్, ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉమ్మడి క్రీడా మైదానం బాగు చేయాలని టీడీపీ యువత అధ్యక్షుడు వాకాడ బాల ఈశ్వర భరత్, టీడీపీ టౌన్ కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసరావు వినతిపత్రం అందించారు

ప్రారంభాలు.. శంకుస్థాపనలు

లక్కవరపుకోట మండలం రంగారయపురంలో రూ.7.50 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే లలితకుమారి ప్రారంభించారు. శృంగవరపుకోట మండలం శివరామరాజుపేటలో రూ.90 లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులకు, రూ.53 లక్షలతో నిర్మించనున్న ఎంఆర్‌సీ భవనం, రూ.3కోట్లతో చేపట్టనున్న బాలికల వసతి గృహం పక్కా భవనం పనులకు శంకుస్థాపన చేశారు. తలారి శివారు ఉసిరి గ్రామంలో రూ.40లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణం, వేపాడ మండలం ముకుందపురంలో రూ.39లక్షలతో నిర్మించిన బ్రిడ్జి ప్రారంభం, కరకవలసలో రూ.32లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీ శ్రీభరత్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దాసరి కార్పొరేషన్ చైర్మన్ రత్నాజీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు రాయవరపు చంద్రశేఖర్, ఇందుకూరి సుధారాణి, ఎస్.కోట, వేపాడ ఎంపీపీలు సోమేశ్వరరావు, సత్యవంతుడు, ఎస్.కోట సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, నాయకులు జీ.ఎస్ నాయుడు, డోకుల చిన్న అచ్చంనాయుడు, కోట్యాడ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘టిడ్కో’ పనుల్లో కదలిక

(5వ పేజీ తరువాయి)



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

లబ్ధిదారులకు అప్పటి మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు లాటరీ పద్ధతిలో ప్లాట్లను కేటాయించారు. అప్పటికి 288 ఇళ్ల నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాలకు గ్రహణం పట్టింది. బేస్‌మెంట్ దశ దాటని వాటికి రివర్స్ టెండరింగ్ వేయాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2019లో ఉగాది నుంచి ఉచితంగా జగనన్న ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించింది. దీంతో టిడ్కో ఇళ్ల కోసం బ్యాంకు డిమాండ్ డ్రాఫ్టులు చెల్లించిన వారంతా తమ డబ్బులు వాపసు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నప్పటికీ నేటికీ అతీగతీ లేకుండా పోయింది. 2024 ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం టిడ్కో లబ్ధిదారులను పిలిచి కొత్త ఇళ్లలోకి వెళ్లిపోవాలని చెప్పింది. కనీసం నీటి వసతి, రోడ్లు, డ్రైయిన్లు, వీధి దీపాలు వంటివి కల్పించకుండా ఇళ్లలోకి ఎలా వెళ్లాలని లబ్ధిదారులు ప్రశ్నించడంతో అప్పట్లో వైసీపీ నాయకులు, అధికారులు కిమ్మనకుండా ఉండిపోయారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పించేం దుకు చర్యలు చేపట్టింది. 250 కిలో లీటర్ల తాగునీటి సామర్థ్యం గల రిజర్వాయరు పనులను అధికారులు ప్రారంభించారు. అలాగే అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం పెద్దఎత్తున జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. మరో 15 రోజుల్లో 1400మీటర్ల పొడవున రోడ్ల నిర్మాణం జరగనుంది.

జూన్ నాటికి పూర్తి..

వచ్చే ఏడాది జూన్ నాటికి అన్ని పనులూ పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. తాగునీటి రిజర్వాయర్, అంతర్గత రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. భూగర్భ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు జరగాలి. రైల్వే అండర్ పాస్ నిర్మాణం ప్రతిపాదనకు అనుమతి రాలేదు. ఇప్పటికే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగింది. ఆ శాఖకు రూ.4.50 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు జూన్ వరకు సమయం పడుతుందని అంచనా వేస్తున్నాం.

-ఎస్.శశిధర్, టిడ్కో డీఈఈ

మరింత నాణ్యతగా ఎండీఎం

(5వ పేజీ తరువాయి)

ఆహారాన్ని రుచి చూస్తున్నారు. బాగుంటేనే పిల్లలకు పెడుతున్నారు. అంతకు ముందే దగ్గరుండి పిల్లలతో చేతులను నీటితో శుభ్రంగా కడిగేలా ప్రోత్సహిస్తున్నారు. గతం మాదిరిగా పిల్లలను బహిరంగంగా విడిచిపెట్టకుండా డైనింగ్ హాల్‌లో భోజనాలు పెడుతున్నారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ఈ విద్యాసంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైంది. దాదాపు 12 వేల మంది వరకూ విద్యార్థులు భోజన పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ఇప్పుడు డైట్ చార్జీలు పెంచడంపై మధ్యాహ్న భోజన నిర్వాహకులతో పాటు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డైట్ చార్జీలు పెరిగాయి..

మధ్యాహ్న భోజన పథకం డైట్ చార్జీలు పెరిగాయి. వీటికి అనుగుణంగానే నిర్వాహకులకు బిల్లులు చెల్లిస్తాం. ఇప్పటికే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. ఫోర్టిఫైడ్ బియ్యం కావడంతో పురుగు పట్టేందుకు అవకాశం లేదు. వంట ఏజెన్సీ వారు తప్పకుండా మెనూను పాటించాలి. ఉపాధ్యాయులు సైతం పర్యవేక్షించాలి.

-ఎం.మాణిక్యాలనాయుడు, డీఈవో, విజయనగరం

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించండి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్‌పై సచివాలయాల పరిధిలో అన్ని వర్గాల ప్రజలకు సమగ్రంగా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కోరాడ వీధి, రావువారి వీధి సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురమిత్ర యాప్ అప్లికేషన్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియకు సంబంధించి ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. కుళాయి పన్నులు, ఆస్తిపన్నుల వసూళ్ల ప్రగతిపై సిబ్బందిని అడిగారు. సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. పౌరసేవల్లో ఎటువంటి లోపం ఉండరాదన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

పనులు పూర్తిచేయండి

●బొబ్బిలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. తాగునీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. వీధి దీపాలను సక్రమంగా నిర్వహించాలి. రోడ్లు, డ్రైయిన్లు పనులను పర్యవేక్షించాలన్నారు. వార్డు ఎమినిటీస్, ఇతర సెక్రటరీలు ఎవరికి నిర్దేశించిన విధులను వారు చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈఈ పెదిరెడ్ల కిరణ్‌కుమార్, ఏఈలు గుప్త, కోటేశ్వరరావు, సచివాలయాల ఎమినిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

‘ఐ లవ్ బొబ్బిలి’ థీమ్ పనుల పరిశీలన

●బొబ్బిలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాణిమల్లమ్మదేవి మున్సిపల్ పార్కు దగ్గర ‘ఐ లవ్ బొబ్బిలి’ ఐకాన్ పనులను శుక్రవారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనర్ రామలక్ష్మి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ పనులను ఇతర అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మల్లమ్మ చెరువులో వ్యర్థాలను తొలగించాలన్నారు. పార్కులో గ్రీనరీని మరింత పెంపొందించాలన్నారు.

పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన



కృష్ణాపురంలో పారిశుధ్య పనులు

బొబ్బిలి రూరల్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మండలమే లక్ష్యంగా నా ఊరు -నా బాధ్యత అనే నినాదంతో గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. స్వచ్ఛతకు కృష్ణాపురం గ్రామాన్ని సూపర్ పైలెట్‌గా ఎంపిక చేసిన నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పరిశుభ్రత, పచ్చదనం, సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటకం తదితర వాటిపై గ్రామస్థులకు జిల్లా కోఆర్డినేటర్ రమణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, సర్పంచ్ సింహాచలం నాయడు, ఎంసీవో సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



చీపురుతో తుడుస్తున్న ఏపీడీవో రత్నం

●రామభద్రపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌లో భాగంగా శుక్రవారం కొట్టక్కి గ్రామంలో ఎంపీడీవో రత్నంతో పాటు పలువురు అధికారులు చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మండలంలోని 60 మంది గ్రీన్ అంబాసిడర్లు హాజరయ్యారు. కాలువలు పూడికలు తీయడం, జంగిల్ క్లియరెన్స్, పెంట చెత్తకుప్పలు తొలగించడం, పీహెచ్‌సీ ముందు బ్లీచింగ్, సున్నం, ఫినాయిల్ చల్లారు. అనంతరం పారిశుధ్యంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన

బాడంగి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం లైంగిక వేధింపుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య నోడల్ అధికారి డాక్టర్ దిలీప్‌చంద్ పాల్గొని మాట్లాడారు. చిన్నారులపై లైంగిక వేధింపులపై ఉన్న అపోహలు, దానివల్ల పిల్లల మానసిక ప్రభావం కోసం వివరించారు. శాఖల వారీగా నిర్వర్తించాల్సిన కార్యక్రమాలు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పలు చట్టాలపై అవగాహన కల్పిస్తూ రిపోర్టింగ్ చేయాల్సిన విధి విధానాలను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, వాడాడ వైద్యాధికారి డాక్టర్ ఎం.నరేష్, ఎంఈవో రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సర్వేల్లో లోపాలు ఉంటే చర్యలు

గరుగుబిల్లి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేల్లో లోపాలు ఉన్నట్లయితే చర్యల తప్పవని జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ ఎం.వినోద్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటా సర్వే పరిశీలన అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌సీడీసీ సర్వేతో పాటు స్కాన్స్ సర్వే నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇంటింటా పరిశీలించి వ్యాధిగ్రస్థులను గుర్తించాలన్నారు. వ్యాధి మైక్రో బాక్టీరియం లెప్రి అనే బ్యాక్టీరియా కారణంగా వ్యాప్తిచెందుతుందన్నారు. వ్యాధికి సంబంధించి తగిన చికిత్సలు తీసుకుంటే నయమవుతుందన్నారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. తప్పుడు నివేదికలు పొందుపర్చకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. పరిశీలనలో ఎపిడిమిక్ వైద్యాధికారి డాక్టర్ కౌశిక్, డాక్టర్ ఎస్ఎంకే తిరుమలప్రసాద్, సిబ్బంది ఉదయకుమారి పాల్గొన్నారు.

యంత్రాంగం ఏం చేస్తోంది?

(5వ పేజీ తరువాయి)

హెచ్చరించారు. కొన్ని మరణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రధానంగా క్షేత్ర స్థాయిలో ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెప్పారు. జిల్లాలో మాతృ, శిశు మరణాలను గణనీయంగా తగ్గించేందు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో జీవనరాణి, డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీరాణి తదితరులు పాల్గొన్నారు.

● గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. పారిశుధ్యం, ఉపాధి పనులపై అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రక్షిత తాగునీటిని సరఫరా చేయాలని, నీటిని ఎప్పటికప్పుడు పరిరక్షించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల కల్పనలో వెనుకబడి ఉన్న మండలాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ నెలాఖరులోగా పురోగతి సాధించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రామికుల నుంచి పని కోసం దరఖాస్తులను స్వీకరించాలని, ఈకేవైసీ లోపాలు కారణంగా రద్దయిన జాబ్‌కార్డులను పునఃపరిశీలించి, అర్హులైన వారి కార్డులను పునరుద్ధరించాలని ఆదేశించారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీఈ సన్యాసిరాజు

బొబ్బిలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సన్యాసిరాజు పరిశీలించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో బెంచీలు, టాయ్‌లెట్స్, తాగునీరు, కాంపౌండ్ వాల్ వంటి మౌలిక సదుపాయాలు ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. వాటన్నింటినీ చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలలో విద్యార్థులకు ఇచ్చే హాల్ టికెట్స్‌లో బార్ కోడ్ రూపంలో సెంటర్ లొకేషన్ ఉంటుందన్నారు. వీటి కోసం జిల్లావ్యాప్తంగా పరీక్ష కేంద్రాల లొకేషన్ కోఆర్డినేట్స్‌ను సేకరిం చామని తెలిపారు. ఆయనతో ఎంఈవో-2 గొట్లాపు వాసుదేవరావు ఉన్నారు.

పారిశుధ్యం బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదే

రామభద్రపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పారిశుధ్యం బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదేనని డీఎల్‌డీవో ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రీన్ అంబాసిడర్లతో ఆయన మాట్లాడారు. చెత్త నిర్మూలించడం ద్వారానే ప్రజలకు ఆరోగ్యం ఇవ్వగలమన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచడంపై గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. దీనిలో ప్రతీ ఒక్కరినీ భాగస్వాములను చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, ఏవో సన్యాసిరావు, ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, రావివలస పంచాయతీ కార్యదర్శి బొద్దూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

రామభద్రపురం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అజు రఫీ జాన్ ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ చొక్కాపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో కొనుగోలు ప్రక్రియను ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమరా శివ, మండల టీడీపీ అధ్యక్షుడు కరణం విజయభాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు వసంతుల తిరుపతిరావు, టీడీపీ నాయకులు మడక తిరుపతిరావు, చొక్కాపు రామారావు, గంట సాయి, బీజేపీ మండల అధ్యక్షురాలు మూడడ్ల ఆదిలక్ష్మి, జనసేన నాయకుడు ధనంజయరావు తదితరులు పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): దిబ్బగుడ్డివలసలోని రైతు సేవాకేంద్రం వద్ద శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం విక్రయాల కోసం రైతులు వాట్సాప్ నెంబర్‌ను 9441306142 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెన్నెల నాగరాజు, వ్యవసాయ సహాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

●బాడంగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి కిరణ్ అన్నారు. బాడంగి రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారీలకు ధాన్యాన్ని విక్రయించి మోసపోరాదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పి.రామారావు, వైస్ ఎంపీపీ ఎస్.భాస్కరరావు, సర్పంచ్ రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ ఎల్.సత్యం ఉన్నారు.

డీఎల్‌డీవో కార్యాలయానికి స్థల పరిశీలన

పాలకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డీఎల్‌డీవో కార్యాలయం ఏర్పాటుకు అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమీపంలో స్థలాన్ని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, డీఎల్‌డీవో గోపాలకృష్ణ గుర్తించారు. సర్వేయర్ శ్రీనివాసరావు ఉన్నారు.

పౌష్టికాహార పంపిణీపై అధికారుల ఆరా



అగురువీధి అంగన్‌వాడీ కేంద్రంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీ, ఐసీడీఎస్ పీడీ విమలారాణి

బొబ్బిలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పంపిణీ అవుతున్న పౌష్టికాహారం, వైద్యసేవలపై జిల్లా అధికారులు తీశారు. శుక్రవారం అధికారులు పర్యటించారు. ఆరు నెలల క్రితం ఓ బాలింత మృతి చెందిన నేపథ్యంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీ, ఐసీడీఎస్ పీడీ పి.విమలా రాణి దర్యాప్తు నిర్వహించారు. స్థానిక ఇందిరమ్మకాలనీలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. పట్టణంలోని అగురు వీధికి చెందిన బాలింత మృతి చెందడానికి కారణాలపై దర్యాప్తు నిర్వహించారు. అనంతరం యూపీహెచ్‌సీ వైద్యుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు, సూపర్‌వైజర్, ఆశావర్కర్లను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మృతి చెందిన బాలింతకు ప్రభుత్వ పరంగా అందిన అన్ని రకాల వైద్య, పోషకాహార సేవలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైద్య సేవల్లో లోపాలపై ఫిర్యాదు చేయండి

బొబ్బిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎనిమిది కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్కడైనా వైద్యం అందించడంలో సేవాలోపం, ఇతరత్రా సమస్యలుంటే నేరుగా ఫిర్యాదులు చేయవచ్చునని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె పట్టణంలో ఆమె విలేకరులతో మాట్లా డారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు, పాము, కుక్క కాట్లకు వ్యాక్సిన్‌లు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రోగులకు బ యట మందులను కొనుగోలు చేసుకోమని డాక్టర్లు చీటీలు రాయడానికి వీల్లేదన్నారు. ఎవరైనా వైద్యులు చెబితే తమ దృష్టికి తీసుకురావాల టన్నారు. బొబ్బిలి సీహెచ్‌సీతో పాటు పలు సీహెచ్‌సీలకు మౌలిక సదుపా యాలు కల్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. ఎటువంటి ఫిర్యాదులు ఉన్నా 9393418309కు తెలియజేయాలన్నారు.

గర్భిణులు వివరాలు నమోదు చేసుకోవాలి

బొబ్బిలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు తన వివరాలను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ప్రమీలా రాణి స్పష్టం చేశారు. శుక్రవారం బొబ్బిలిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వివరాలు నమోదు చేసుకున్న వారికి పోషకాహారం, ఇమ్యునైజేషన్ ఇతర ఆరోగ్యమపరమైన సేవలు సక్రమంగా అందడానికి వీలవుతుందన్నారు. నెలకు ఐదు లీటర్ల పాలు, ఐరన్‌తో పాటు అన్ని పోషకాలను అందించే చిక్కీలు, గుడ్లు, బెల్లం, అటుకులు, రాగి వంటి ఆహారాన్ని అందిస్తామన్నారు. ఇంత వరకు ఆ ప్రాజెక్ట్ పరిధిలో 206 మంది గర్భిణులు నమోదయ్యాయన్నారు. రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆమె వెంట స్థానిక ప్రాజెక్టు అధికారిణి జె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని దినాలు పెంచండి

రామభద్రపురం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పని దినాలు పెంచాలని ఏపీడీ రమామణి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ వేతనదారుడికి ఈకేవైసీ చేయించాలన్నారు. సరాసరి వేతనం రూ.300 అందేలా చూడాలన్నారు. కంపోస్టు పిట్స్, ఫాంపాండ్స్ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నం, ఏపీవో త్రినాథరావు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు



సత్కరిస్తున్న సేవాసమితి ప్రతినిధులు

బొబ్బిలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూల్‌బాగ్‌లోని సత్యసాయిమందిరంలో నిర్వహిస్తున్న సత్యసాయి శతజయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. సాయిభజనలు, పూజలు, నామస్మరణ కార్యక్రమాలతో పాటు స్థానిక కోటి చెరువు గట్టుపై మొక్కలు నాటారు. నిరుపేదలకు, అభాగ్యులకు అందజేస్తున్న అమృతకలశాలు, నారాయణసేవ దాతలకు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో భక్తులు సన్మానించారు. అనంతరం శిల్పి ఈదుబిల్లి జగన్నాథం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు మరడ అప్పారావు దంపతులు, తమ్మిరెడ్డి వేణుగోపాలనాయుడు, చిన్నమ్మలు, ఎస్.వి.రమణమూర్తి, సాయిబాబా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు ఉపకరణాల వితరణ



ఉపకరణాలను అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్ ట్రేడులో శిక్షణ పొందుతున్న 40 మంది విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను ఐటీఐ సహాయక శిక్షణాధికారి, రోటరీ క్లబ్ కార్యదర్శి కె.శివకాంత్ వితరణ చేశారు. శుక్రవారం ఐటీఐలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు. రోటరీ ప్రతినిధులు శ్రీనివాసన్, సిబ్బంది రాములప్పడు, హరికృష్ణ, యుగంధర్ ఉన్నారు.



అసంపూర్తిగా నిలిచి ఉన్న భవన నిర్మాణం

పూర్తిచేసేదెప్పుడు?

●కలవరాయిలో అసంపూర్తిగా వెల్‌నెస్ భవన నిర్మాణం

బొబ్బిలి రూరల్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): కలవరాయిలో వెల్‌నెస్ కేంద్రం భవన నిర్మాణం నాలుగేళ్లుగా అసంపూర్తిగా నిలిచి ఉంది. గత ప్రభుత్వ హయంలో ప్రారంభించిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు నిలిచాయి. నిర్మాణ వ్యయం పెరిగిపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు. ప్రస్తుతం అద్దె భవనంలో వెల్‌నెస్ కేంద్రం కొనసాగుతోంది. దీంతో ఇటు రోగులకు, అటు వైద్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడంలేదు. ● ఈ విషయంపై పీఆర్ ఏఈ రాజశేఖర్‌ని వివరణ కోరగా.. అసంపూర్తిగా నిలిచిన భవనం కోసం ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు.